క్లుప్తంగా

ఆంజనేయ స్వామికి పూజలు



పాలపాటి దిన్నె ఆంజనేయ స్వామి ఆలయంలో భజన చేస్తున్న భక్తులు

నల్లచెరువు: పాలపాటి దిన్నెలో శనివారం ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు భజన చేశారు. ప్రతి వారం నిర్వహించే అన్నదాన కార్యక్రమానికి దేవరింటిపల్లికి చెందిన నాగేంద్ర విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ దేవరింటి భాస్కర్‌రెడ్డి సభ్యులతో కలిసి దాతను సన్మానించి ప్రసాదం అందజేశారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



వృద్ధులకు వైద్య పరీక్షలు చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

నల్లచెరువు: సీజనల్ వ్యాధులపై గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారిణి డాక్టర్ కల్పనారెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని ఉప్పార్లపల్లి గ్రామంలో వైద్యాధికారులు ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. రోగుల ఇంటి వద్దకే వెళ్లి వైద్య సేవలు అందించారు. దివ్యాంగులు, గర్భిణులు, బాలింతలకు బీపీ, షుగర్ తదితర వైద్య పరీక్షలు చేశారు. ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సూర్యనారాయణ రెడ్డి, ఏఎన్ఎం భాగ్యమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ హరిత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు



గాయపడిన బాలాజీ నాయక్



ప్రమాదానికి కారణమైన కారు

నల్లచెరువు: జోగన్నపేట సమీపంలోని జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బాలేపల్లి తండాలోని ఒకే కుటుంబానికి చెందిన బాలాజీ నాయక్, సుశీల బాయి, సంజు నాయక్ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని బాలేపల్లి తండాకు చెందిన బాలాజీ నాయక్ తన భార్య సుశీల బాయి కుమారుడు సంజు నాయక్‌లతో కలసి కదిరికి వెళ్లారు. పని ముగించుకుని తిరిగి కుటుంబ సభ్యులతో కలిసి ద్విచక్ర వాహనంలో స్వగ్రామం బాలేపల్లికి బయలు దేరాడు. అయితే జోగన్నపేట సమీపంలోకి రాగానే మదనపల్లి వైపు నుంచి కదిరి వైపు వేగంగా వెళ్తున్న కారు వీరు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బాలాజీ నాయక్ తలకు తీవ్ర గాయమైంది. భార్య సుశీల బాయి, కుమారుడు సంజూ నాయక్‌కు కాళ్లు విరిగాయి. గమనించిన స్థానికులు గాయపడిన వారిని 108 ద్వారా కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఐఎన్ఐ-సెట్‌లో ధర్మవరం యువతి ప్రతిభ



అంబటి నైమిశాను అభినందిస్తున్న దృశ్యం

ధర్మవరం: ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నేషనల్ ఇంపార్టెన్స్ కంబైన్డ్ ఎంట్రెన్స్ టెస్టు (ఐఎన్ఐ-సెట్)లో ధర్మవరం యువతి అంబటి నైమిశా సత్తా చాటింది. ఆల్ ఇండియా 19వ ర్యాంకు సాధించింది. కర్నూలు పుల్లారెడ్డి డెంటల్ కళాశాలలో బీడీఎస్ పూర్తి చేసిన అంబటి నైమిశా ఉత్తమ ర్యాంక్ సాధించడంతో తల్లిదండ్రులు అభినందించారు. ఈమెకు మాస్టర్ ఆఫ్ డెంటల్ సర్జన్ (ఎండీఎస్)లో ప్రవేశం దక్కనుంది.



మాక్‌డ్రిల్‌లో భాగంగా గొడవలు చేసే వారిని అడ్డుకుంటున్న పోలీసులు



ఆందోళనకారులతో మాట్లాడుతున్న పోలీసులు

ఆకట్టుకున్న మాక్‌డ్రిల్



మాక్‌డ్రిల్‌పై అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు, సీఐలు

ధర్మవరం అర్బన్: పట్టణంలో శనివారం సాయంత్రం పోలీసులు మాక్‌డ్రిల్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ మాధవరెడ్డి ఆదేశాలతో డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో సబ్ డివిజన్‌లోని సీఐలు, ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది మొత్తం పట్టణంలోని కాలేజీ సర్కిల్‌లో మాక్‌డ్రిల్ చేపట్టారు. 144 సెక్షన్‌తో పాటు ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పుడు ప్రజలు గుంపులు గుంపులుగా ఉన్నా అక్రమంగా సమావేశాలు నిర్వహించినా ఎలాంటి ధర్నాలు, నిరసనలు, ఉత్సవాలు చేయడం చట్టరీత్యా నేరమని డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు. నిరసనలను చెదరగొట్టే క్రమంలో పోలీసులు గుంపులు గుంపులుగా ఉన్న ప్రజలకు మొదట మైకు ద్వారా హెచ్చరికలు జారీ చేయడం జరుగుతుందన్నారు. గుంపులు చెదిరిపోని పక్షంలో భాష్పవాయువు, లాఠీచార్జి చేస్తామన్నారు. అయినా గుంపులు చెదరపోకపోతే శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా చివరగా గుంపుపై పోలీసులు కాల్పులను జరిపి ప్రజల ధన, మాన, ప్రాణ నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ మాక్‌డ్రిల్‌లో వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం, టూటౌన్ సీఐ అశోక్ కుమార్, ఎస్‌ఐ నరేంద్ర, పోలీసులు, హోంగార్డులు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



మడకశిర సర్కిల్‌లో సీజ్ చేసిన వాహనాలను చూపుతున్న పోలీసులు

పుట్టపర్తి టౌన్: ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. శనివారం జిల్లా వ్యాప్తంగా అన్ని సబ్‌డివిజన్ల పరిధిలోని సమస్యాత్మక ప్రాంతాల్లో ఎస్పీ ఆదేశాల మేరకు సీఐలు, ఎస్‌ఐల ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. అక్రమంగా దాచి ఉంచిన ఆయుధాలు, పేలుడు పదార్థాలు, బాణసంచా, పెట్రోల్, డీజిల్‌తో పాటు మడకశిర సర్కిల్ పరిధిలో పత్రాలు సరిగా లేని 18 వాహనాలను సీజ్ చేశారు. అనంతరం గ్రామ సభలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు ప్రజల సహకారంతో పోలింగ్ ప్రక్రియ ముగించామన్నారు. గ్రామాల్లో ఎలాంటి గొడవల జోలికి వెళ్లకుండా కౌంటింగ్ ప్రక్రియ సజావుగా సాగేందుకు సహకరించాలని సూచించారు. గ్రామాల్లో ఎలాంటి గొడవల జోలికి వెళ్లకుండా ప్రశాంతమైన జీవితం గడపాలని తెలిపారు. అనుమానిత వ్యక్తులు, పాత నేరస్తుల కదలికలు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

కురుబలు అన్ని రంగాల్లో రాణించాలి



విద్యార్థినికి నగదు బహుమతి అందిస్తున్న కురుబ సంఘం నాయకులు

ధర్మవరం అర్బన్: కురుబ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని కురుబ సంఘం పట్టణ అధ్యక్షుడు మాలగుండ్ల మల్లికార్జున తెలిపారు. శనివారం పట్టణంలోని యశోదమ్మ వకీలు పెద్దయ్య కురుబ కళ్యాణ మండపంలో పదో తరగతి, ఇంటర్ పరీక్షల్లో ప్రతిభ చూపిన కురుబ విద్యార్థులకు ప్రతిభా అవార్డులతోపాటు ప్రోత్సాహక నగదు బహుమతులు అందజేశారు. పదో తరగతిలో బిల్లే యశస్విని (588), గొంగటి ధనలక్ష్మి (586), బిల్లే అమృత (582) మార్కులు సాధించారు. వీరికి ప్రథమ బహుమతి రూ.5 వేలు, ద్వితీయ బహుమతి రూ.3 వేలు, తృతీయ బహుమతి రూ.2వేలుతో పాటు మెమొంటోలు అందించారు. 500లకు పైగా మార్కులు సాధించిన 50 మంది విద్యార్థులకు కన్సోలేషన్ బహుమతిగా రూ.1000 నగదు, మెమొంటోలు అందించారు. ఇంటర్‌లో పసవుల ప్రీతి (984), బండి సాయికీర్తి (970), కాపాడం చంద్రికారాణి (967) మార్కులతో సత్తా చాటారు. వీరికి కూడా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందించారు. కార్యక్రమంలో కురుబ సంఘం నాయకులు కప్పల బలరాముడు, బండి ఉజ్జినప్ప, కోటి వెంకటేష్, గవ్వలబాబు, బులగుండ్ల నాగార్జున, నారాయణస్వామి, ఆకులేటి వెంకటేష్, రామంజినేయులు, నారాయణ, గిరక మల్లికార్జున, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చిన్నమ్మ పెట్టె ఊరేగింపు



చిన్నమ్మ దేవత పెట్టెను మోస్తూ భక్తుల మీదుగా నడిచి వెళ్తున్న పూజారి

నల్లమాడ: మండలంలోని వంకరకుంట గ్రామ సమీపాన వెలసిన మహిమాన్వితురాలు పసిబాల చిన్నమ్మ దేవత పరుష శనివారం ప్రారంభమైంది. ఓడీ చెరువు మండలంలోని బత్తినపల్లి నుంచి చిన్నమ్మ మూల విరాట్ కొలువుదీరిన పెట్టెను ఉరుము వాయిద్యాలతో చౌటకుంటపల్లి, చిల్లగోర్లపల్లి, నల్లమాడ, సీ.కొత్తపల్లి, చెరువువాండ్లపల్లి మీదుగా కాలినడకన పూజారులు ఊరేగింపుగా బసిరెడ్డిపల్లికి తీసుకెళ్లారు. ఆయా గ్రామాల్లో భక్తులు అమ్మవారికి కాయకర్పూరం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. తమ కోర్కెలు నెరవేర్చాలంటూ పలుచోట్ల భక్తులు రహదారిపై అడ్డంగా బోర్లా పడుకున్నారు. అమ్మవారి పెట్టెను మోస్తున్న పూజారి వారిమీదుగా నడిచి వెళ్లడంతో అమ్మవారు తమ కోర్కెను మన్నించారని భక్తులు పరవశించపోయారు. ఆదివారం విడిదినం, సోమవారం బసిరెడ్డిపల్లి నుంచి అమ్మవారు చిన్నమ్మ గుడిచేరుట, మంగళవారం బండ్లు, బుధవారం కుంకాలతో పరష ముగుస్తుందని నిర్వాహకులు తెలిపారు.

చికిత్స పొందుతూ బాలిక మృతి

గాండ్లపెంట: ఈ నెల 22న కడుపునొప్పి తాళలేక విషద్రావకం సేవించి ఆత్మహత్యాయత్నం చేసిన మండల పరిధిలోని తూపల్లి గ్రామానికి చెందిన పి.శివారెడ్డి కుమార్తె పి.భవతి (15) అనంతపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మృతి చెందింది.ఏఎస్‌ఐ రంగానాయక్ తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి.. బాలిక నెలరోజులుగా కడుపునొప్పితో బాధపడుతోంది. ఈ క్రమంలో కడుపునొప్పి తీవ్రం కావడంతో ఈనెల 22న ఇంట్లో ఎవరూ లేని సమయంలో విషద్రావకం సేవించి ఆత్మహత్యాయత్నం చేసింది. అపస్మారక స్థితిలో ఉన్న బాలికను హుటాహుటిన చికిత్స నిమిత్తం కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో పి.భవతి మృతి చెందింది. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

శాంతియుతంగా జీవించండి



గ్రామస్తులకు సూచనలు చేస్తున్న ఎస్‌ఐ వెంకటేశ్వర్లు

చెన్నేకొత్తపల్లి : అందరూ కలసిమెలసి శాంతియుతంగా జీవించాలని ఎస్‌ఐ వెంకటేశ్వర్లు గ్రామస్తులకు సూచించారు. హరియాన్‌చెరువు గ్రామంలో శనివారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఏపీఎస్పీ, స్థానిక పోలీస్ సిబ్బందిలో కలసి ఉదయాన్నే గ్రామంలో అనుమానితులు, నేర చరిత కలిగిన, లిక్కర్ కేసుల్లో ఉన్న వారి ఇళ్లలో క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ గొడవలు, అల్లర్ల జోలికి వెళ్లకుండా బుద్ధిగా పనులు చేసుకుని జీవనం సాగించాలని సూచించారు. ఎన్నికల ఓట్ల లెక్కింపు ఫలితాల రోజున గ్రామంలో అవాంఛనీయ ఘటనలకు తావుండకూడదన్నారు. బాణసంచా కాల్చరాదన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నాయకులు, గ్రామస్తులు పోలీసులకు సహకరించాలని కోరారు.

వీఆర్వోలు గ్రామాల్లో పర్యటించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ శివశంకర్ నాయక్

బత్తలపల్లి: మండలంలోని వీఆర్వోలు, వీఆర్‌ఏలు రోజూ గ్రామాల్లో పర్యటించాలి. అక్కడి పరిస్థితులను తమ దృష్టికి తీసుకురావాలని తహసీల్దార్ శివశంకర్ నాయక్ ఆదేశించారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, వీఆర్‌ఏలతో ఏఎస్‌ఓ డాక్టర్ లక్ష్మీనరసింహ శర్మతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. మండలంలో సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని అందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా కౌంటింగ్ ప్రక్రియ కూడా సజావుగా సాగేలా అందరి సహకారం ఉండాలని కోరారు. ముఖ్యంగా పెట్రోలు బంకు నిర్వాహకులతో చర్చించి ఏ పెట్రోలు బంకు నుంచి కూడా చిల్లరగా పెట్రోల్, డీజిల్ అమ్మవద్దని ఆదేశాలు జారీ చేయాలని సూచించారు. అలా ఎవరైనా చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించాలన్నారు. గ్రామాల్లో ప్రతి రోజూ పర్యటించి క్షేత్రస్థాయిలో ఏవైనా అవాంఛనీయ సంఘటనలు జరిగే పరిస్థితి ఉంటే ఆ విషయాన్ని తహసీల్దార్‌కు గానీ, పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐకి గాని వెంటనే తెలియజేయాలని సూచించారు. సర్టిఫికెట్లు, పట్టాదారు పాసుపుస్తకాల మంజూరులో జాప్యం చేయొద్దని ఆదేశించారు. విద్యార్థులకు కావాల్సిన సర్టిఫికెట్స్ మీ లాగిన్‌కు వచ్చిన వెంటనే చెక్ చేసి క్లియర్ చేయాలన్నారు. సమావేశంలో వీఆర్వోలు, వీఆర్‌ఏలు తదితరులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో కార్డెన్ సెర్చ్

బత్తలపల్లి: గ్రామాల్లో ప్రజలు గొడవలు లేకుండా కలిసి మెలిసి జీవించాలని ఎస్‌ఐ పి.శ్రీనివాసులు సూచించారు. శనివారం మండలంలోని ఈదుల ముష్టూరు, పెద్ద కొట్టాల, గంటాపురం గ్రామాల్లో కార్డెన్ సర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని అనుమానితుల ఇళ్లల్లో సోదాలు చేపట్టారు. రౌడీ షీటర్లు ట్రబుల్ మాంగర్స్‌కు కౌన్సెలింగ్ ఇచ్చారు. తనిఖీల్లో రికార్డులు లేని రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఎస్‌ఐ మాట్లాడుతూ.. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగాయని తెలిపారు. ఎన్నికల ఫలితాలు వచ్చే వరకు, ఆ తరువాత కూడా గ్రామాల్లో అందరూ కలిసి మెలిసి ఉండాలన్నారు. ఎన్నికల ఫలితాలు వచ్చే వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందని తెలిపారు. ముఖ్యంగా చిన్న చిన్న గొడవలకు కేసులు పెట్టుకుని కోర్టు చుట్టూ తిరగవద్దని సూచించారు. గ్రామాల్లో సారా తయారీ, విక్రయాలు చేస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌టీఎఫ్ రాష్ట్ర యువజన అధ్యక్షుడిగా రాజశేఖర్



రాజశేఖర్‌కు నియామక పత్రం అందిస్తున్న రాష్ట్ర నాయకులు

ధర్మవరం అర్బన్: నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ రాష్ట్ర యువజన అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన సాకే రాజశేఖర్ అలియాస్ యర్రగుంట రాజాను ఎంపిక చేశారు. శనివారం విజయవాడలోని ఎన్‌టీఎఫ్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఎన్‌టీఎఫ్ జాతీయ అధ్యక్షుడు కుంభా రవిబాబు సూచనలతో రాష్ట్ర అధ్యక్షుడు మనుపాటి నవీన్ తదితరులు సాకే రాజశేఖర్‌కు నియామక పత్రం అందించారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో రాష్ట్ర యువజన అధ్యక్షుడిగా అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో గిరి జన సమస్యలు, హక్కులపై పోరాటం చేస్తామని పేర్కొన్నారు.

అక్రమంగా నిల్వ ఉంచిన టపాసుల సీజ్



స్వాధీనం చేసుకున్న టపాసులను చూపుతున్న సీఐ యతీంద్ర

ముదిగుబ్బ: మండల కేంద్రానికి చెందిన సోమల నాగార్జున ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా నిల్వ చేసిన టపాసులను మరోచోటికి తరలిస్తుండగా పోలీసులకు పట్టుబడ్డాడు. హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్ద రూ.1,46,210 విలువ చేసే టపాసులను సీజ్ చేసినట్లు సీఐ యతీంద్ర తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ అమలులో ఉండగా ఎవరైనా టపాసులను నిల్వ ఉంచి వ్యాపారం చేస్తే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో పూజలు

తాడిమర్రి: ఏకపాదంపల్లి గ్రామంలోని లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ పూజారి స్వామి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం చేశారు. అనంతరం వెండి ఆభరణాలు తొడిగి, వివిధ రకాల పూలమాలలతో అందంగా అలంకరించారు. కుంకుమార్చన తదితర పూజలు చేశారు. అనంతరం అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామికి కొబ్బరికాయలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

డిగ్రీ కోర్సుల్లో అడ్మిషన్లు ప్రారంభం

పుట్టపర్తి: బుక్కపట్నం సత్యసాయి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ మగ్బుల్ హుస్సేన్ తెలిపారు. శనివారం కళాశాల సిబ్బందితో కలిసి అడ్మిషన్లకు సంబంధించిన బ్రోచర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ఇంటర్ పూర్తి చేసిన వారు డిగ్రీలో చేరేందుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అడ్మిషన్లు పూర్తిగా ఉచితమన్నారు. బీకాం కంప్యూటర్స్, బీఏ స్పెషల్ తెలుగు, బీఏ ఎకనామిక్స్, బీఎస్సీ మేథమెటిక్స్ తదితర గ్రూపుల్లో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9441575211, 9701191552 నంబర్లకు సంప్రదించాలన్నారు.

సమ్మర్ క్యాంప్ సద్వినియోగం చేసుకోండి



విద్యార్థులకు సూచనలు చేస్తున్న విశ్రాంత ఉపాధ్యాయుడు రంగారెడ్డి

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని విశ్రాంత ఉపాధ్యాయుడు రంగారెడ్డి సూచించారు. శనివారం ఆయన గ్రంథాలయాన్ని సందర్శించారు. ఇక్కడ శిబిరంలో పాల్గొన్న విద్యార్థులతో మాట్లాడారు. సమ్మర్ క్యాంపులో భాగంగా కథల పుస్తకాలు చదివించడం, కథలు చెప్పించడం, చెస్, క్యారమ్స్ తదితర ఆటలు నేర్పించడం జరుగుతుందన్నారు. విద్యార్థులు చక్కగా వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి కృష్ణయ్య, నాని, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఎడ్ల బండ్ల మెరవణి



ఊరేగింపుగా వస్తున్న ఎడ్ల బండ్లు

తలుపుల: స్థానిక ఎగువపేట సమీపంలోని ఏటి గంగమ్మ ఆలయం వద్ద మొలకల పౌర్ణమి వేడుకల్లో భాగంగా శనివారం టి.రెడ్డివారిపల్లి, బలిజ పేట, ఎగువపేట గ్రామాల నుంచి ఎడ్ల బండ్ల మెరవణి నిర్వహించారు. తొలుత గ్రామాల్లోని ఎడ్ల బండ్లను ప్రత్యేకంగా అలంకరించారు. ఆయా వీధుల్లోని బొడ్రాతమ్మలకు కొబ్బరికాయలు కొట్టి తప్పెట్లు, బాణసంచా పేల్చుతూ ఊరేగింపుగా తరలివచ్చారు. అనంతరం ఏటి గంగమ్మ ఆలయం చుట్టూ మూడు ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రికి సాసవుల చెన్నమ్మ కథ పులివెందుల వాస్తవ్యుల ఆధ్వర్యంలో హరికథా కాలక్షేపం నిర్వహించారు.